క్లుప్తంగా

సీబీఎస్ఈ అథ్లెటిక్స్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ



తెనాలి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీబీఎస్ఈ క్లస్టర్ పరిధిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని స్థానిక నాజరుపేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలు కరస్పాండెంట్/ డైరెక్టర్ డాక్టర్ సూరజ్ మోహన్ చెప్పారు. నెల్లూరులో ఈనెల 5–7 తేదీల్లో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ అథ్లెటిక్స్ పోటీలు అండర్–17లో తమ విద్యార్థి రసూల్ అత్యంత ప్రతిభను ప్రదర్శించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఇదే విభాగంలో జావలిన్ త్రోలో షేక్ రోషన్ రేహాన్ కాంస్య పతకం సాధించాడు. అండర్–17లో హైజంప్‌లో పాల్గొన్న తమ విద్యార్థి ఎం.కళ్యాణ్ సాయినాయక్ కాంస్య పతకం గెలిచినట్టు వివరించారు. ఆయా క్రీడాకారులను గురువారం సాయంత్రం పాఠశాలలో అభినందించారు.

రాష్ట్ర డీలర్ల సంఘం జాయింట్ సెక్రటరీగా అబ్దుల్లా



తెనాలిఅర్బన్: రాష్ట్ర డీలర్ల సంఘం జాయింట్ సెక్రటరీగా సయ్యద్ అబ్దుల్లా, మహిళా విభాగం కోశాధికారిగా బి.నాగమల్లేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు ప్రకటించారు. పట్టణంలో గురువారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లీలా మాధరావు మాట్లాడుతూ డీలర్లకు కమిషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్ళినట్లు చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.

సకాలంలో విధులకు హాజరుకావాలి

తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరుకావాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు సూచించారు. రామలింగేశ్వరపేటలోని శానిటేషన్ కార్యాలయం గురువారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం లేకుండా చూసుకోవాలన్నారు. కేటాయించిన పనిని పూర్తిస్థాయిలో చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ పుట్టినరోజు పురస్కరించుకుని బీసీ కాలనీలో గురువారం 25 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సభ్యుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు డాక్టర్ జీవనలత, జగదీశ్వరాంబ, కుర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అసెస్మెంట్ బుక్‌లెట్‌లు పంపిణీ

తెనాలిఅర్బన్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు అవసరమైన అసెస్మెంట్ బుక్‌లెట్‌లను హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్‌లో గురువారం హెచ్‌ఎంలకు బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రాజారెడ్డి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: షేక్ నాజర్, సైదాబీల నాల్గవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు షేక్ మీరావలి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, కమాన్ వలి, చిన్నబాజీ, ఎర్రబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మండల విద్యాశాఖాధికారి–1 సీహెచ్ వనజాక్షి సూచించారు. మండల విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఈఓ–2 రమేష్ మాట్లాడారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, పావులూరు లక్ష్మి, శివశంకరావు, ఎమ్మార్సీ సిబ్బంది కోటేశ్వరరావు, అనిత, సీఆర్పీ ప్రసాద్, భాస్కరరావు, ప్రసన్న, ప్రశాంతి పాల్గొన్నారు.

ఈద్గాల్లో మౌలిక వసతులు కల్పించండి

- వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం నేతలు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇచ్చిన ముస్లిం మైనారిటీ నేతలు

తెనాలి: ముస్లిం మైనార్టీలకు చెందిన ఈద్గాలను పరిరక్షించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు, మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రాలను అందజేశారు. తెనాలి పట్టణంలో ముస్లిం మైనారిటీలకు చెందిన ఈద్గాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని పార్టీ నియోజకవర్గ మైనారిటీ విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు కోరారు. పట్టణ చెంచుపేటలోని ఈద్గా సమీపంలోని ఖబరిస్తాన్‌లో మృతదేహాలను ఖననం చేసేందుకు అవసరమైన గోతులు తీసేందుకు మనుషులు ఎవరూ లేరని తెలిపారు. పట్టణానికి చెందిన సయ్యద్‌బాషా అనే వ్యక్తి చనిపోగా, అతడి మృతదేహాన్ని ఖననం చేసేందుకు ఎవరూ లేకపోవటంతో కుటుంబసభ్యులే గొయ్యి తీసుకోవాల్సి వచ్చిందని, ఆ సమయంలో విద్యుత్ లైట్లు లేకపోవటం తీవ్ర అసౌకర్యం కలిగించిందని మైనారిటీ నాయకులు శ్రీధర్‌బాబుకు వివరించారు. విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి, సిబ్బందిని నియమించి తగిన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ పెచ్చింగ్ సుభాని, మాజీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, షేక్ కాజా, షేక్ ఫరీద్, షేక్ అహ్మది షేక్, ఆసిఫ్ షేక్, సాదిక్ షేక్, చాంద్ బాషా, షేక్ అజ్మల్, షేక్ యూసుఫ్, షేక్ రఫీ, షేక్ సలీం పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

పిడపర్రులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'



పిడపర్రులో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సుధాకరరెడ్డి

పిడపర్రు(కొల్లిపర): ముఖ్యమంత్రి చంద్రబాబు మాయ మాటలు నమ్మొద్దని సర్పంచ్ దూరు రత్నబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వంగా సుధాకర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాలతో పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలో పిడపర్రు గ్రామంలో గురువారం 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వంచనను వివరించి ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. ఈ సంవత్సర కాలంలో వారికి ప్రభుత్వ పథకాలు ఎన్ని వచ్చాయి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంవత్సర కాలంలో వారి కుటుంబానికి ఎన్ని సంక్షేమ పథకాలు వచ్చాయి అన్న అంశాలను అడిగితెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వానికి మధ్య సంక్షేమం, అభివృద్ధిలో ఉన్న తేడాలను వివరించారు. ఈ సందర్భంగా వంగా సుధాకరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అని గద్దెనెక్కి తరువాత ప్రజలను మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయని కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబును నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలుషితం లేని ఆహారాన్ని తీసుకోండి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



నీరజకు ఇంటి స్థలం పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్, పక్కన తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిఅర్బన్: జీవన విధానంలో వస్తున్న మార్పుల వలన ఎక్కువ మంది కలుషిత ఆహారాన్ని తీసుకుంటున్నారని, దీని వలన అనారోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో నలుగురికి రూ.12.76 లక్షల విలువ చేసే చెక్కులను గురువారం సాయంత్రం పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఇటీవల 51 రెస్టారెంట్‌లను అధికారులు తనిఖీ చేయడం జరిగిందన్నారు. వాటిలో 44 రెస్టారెంట్‌లు కలుషిత ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి కలుషితం లేని ఆహారాన్ని తీసుకుని జీవన ప్రమాణాన్ని పెంచుకోవాలన్నారు. తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2.76 కోట్లు విలువ చేసే 222 చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ ఉండటానికి నివాసం లేని పేద కుటుంబానికి ఇంటి స్థలాన్ని పంపిణీ చేశారు. తహశీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ గత నెల 30న కొలకలూరులో మెగా గ్రీవెన్స్ నిర్వహించడం జరిగిందన్నారు. ఆ సమయంలో కొలకలూరుకు చెందిన జంపని నీరజ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి తన భర్త దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడని, కనీసం నివసించడానికి సొంత ఇల్లు కూడా లేదని, ఇంటి స్థలం ఇప్పించాలని కోరడం జరిగిందన్నారు. స్పందించిన ఆయన వారం రోజుల్లో ఇంటి స్థలం కొలకలూరులో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

రేపు 'అల్లిక' కవితా సంపుటి పరిచయ సభ

తెనాలి: తెనాలి ప్రాంతానికి చెందిన ప్రముఖ రచయిత్రి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి రచించిన కవితల సంపుటి 'అల్లిక' పుస్తక పరిచయ సభ ఈనెల 9న తెనాలిలో జరగనుంది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం), తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు ఏర్పాటయే సభకు అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహిస్తారు. అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. బహుజన రచయితల వేదిక డాక్టర్ నూకతోటి రవికుమార్, తంగిరాల సోని, సామాజిక పరివర్తన కేంద్రం వున్నవ వినయ్‌కుమార్, అరసం కృష్ణాజిల్లా నేత శిఖా ఆకాష్, 'అచీవ్స్' నుంచి డాక్టర్ మిరప మాధవి పాల్గొంటారు.

నెహ్రూనికేతన్‌లో విద్యార్థి సంఘ ఎన్నికలు



తెనాలిఅర్బన్: చిన్న వయస్సు నుంచే లీడర్‌షిప్ క్వాలిటీలను అలవాటు చేసుకోవాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ సూచించారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో గురువారం విద్యార్థి సంఘ ఎన్నికలను నిర్వహించారు. గెలుపొందిన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదికి సత్కారం

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది పెరికల డేనియెల్‌ను ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ మధ్యవర్తిగా శిక్షణ ఇచ్చి, హైకోర్టు మధ్యవర్తిగా నియమించింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని న్యాయవాది వేములపల్లి శ్రీనివాస్ కార్యాలయంలో గురువారం డేనియల్‌ను న్యాయవాదులు సత్కరించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా హైకోర్టు వరకు పేదలు రాలేక న్యాయం పొందలేకపోతున్నారని, అటువంటి వారికి న్యాయ సహాయం అందిస్తానని డేనియల్ తెలిపారు. మూల్పూరి లాజరస్, ఎ.కిషోర్, కె.సునీల్, రెడ్డి వెంకటేశ్వరరావు, ఎ.సుబ్బారావు, ఎస్.రవికృష్ణ, మాతంగి కుమార్, కె.వెంకటేశ్వరరావు, సీహెచ్ సురేష్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి అద్దె అడిగినందుకు దాడి

తెనాలిరూరల్: ఇంటి అద్దె చెల్లించకుండ ఖాళీ చేసి వెళ్లిపోయిన వారిని అద్దె చెల్లించాలని అడగడంతో ఇంటి యజమాని, అతని భార్య, కుమారుడిపై దాడి చేసిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన రామారావు తన ఇంటి కింది పోర్షనును ఓ కుటుంబానికి అద్దెకు ఇచ్చాడు. అద్దె సక్రమంగా చెల్లించకపోతుండడంతో ఖాళీ చేయించాడు. అద్దె చెల్లించకపోగా, కరెంటు బిల్లును కూడా చెల్లించకుండా వెళ్లిపోయారు. అద్దె, కరెంటు బిల్లు చెల్లించమని ఫోనులో అడగడంతో గౌసియా షకీలా, మౌలాలి మరి కొందరు రామారావు ఇంటికి వచ్చి అతనిపై అతని భార్య, కొడుకుపై దాడి చేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ కరిముల్లా గురువారం రాత్రి తెలిపారు.

కుమార్తె సహా తల్లి అదృశ్యం

తెనాలిరూరల్: కుమార్తె సహా తల్లి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ హడ్కో కాలనీకి చెందిన 36 ఏళ్ల దివ్య తన ఏడేళ్ల కుమార్తెతో కలసి బుధవారం సాయంత్రం ఇంటి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు గురువారం నమోదు చేశారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



ర్యాలీలో పాల్గొన్న లక్ష్మీపతిరావు, అధికారులు

తెనాలిఅర్బన్: దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి రణరంగ్ చౌక్ వరకు ట్రయిల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి రణరంగ్ చౌక్ వద్ద ఏడుగురిని బ్రిటీషర్లు హతమార్చడం జరిగిందన్నారు. అమరులైన వారి త్యాగాలను ఈ నెల 12వ తేదీన స్మరించుకోనున్నట్లు చెప్పారు. ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు, డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసులు, పలువురు ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మో... సీ–5నా..!

- మున్సిపల్ కార్యాలయంలోని సీ–5 స్థానంలోకి వచ్చేందుకు ఉద్యోగులు విముఖత
- ఇటీవలే అవినీతి ఆరోపణలతో బదిలీయైన ఆ స్థానం ఉద్యోగిని

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని సీ–5 సీటు హాట్‌గా మారింది. ఈ సీటులో పనిచేసే ఉద్యోగిని బదిలీ కావడం ఆ స్థానంలో నియమించిన మరో మహిళా ఉద్యోగిని విధుల్లో చేరేందుకు విముఖత చూపడం పురపాలక సంఘంలో చర్చనీయాశంగా మారింది. తెనాలి పురపాలక సంఘంలోని మేనేజర్ కార్యాలయంలో సీ–5 సీటు ఉంది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు సచివాలయ విధులకు సంబంధించిన అన్ని పనులు చూస్తు ఉంటారు. గతంలో భారతి అనే క్లర్క్ పనిచేయగా, పలు ఆరోపణలు రావడంతో అధికారులు ఆమెను కొత్తపేటలోని మున్సిపల్ స్కూల్‌కు బదిలీ చేశారు. ఆ స్థానంలో రెవెన్యూ విభాగంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ విజయశాంతిని నియమించారు. ఇలా జరిగి వారం దాటుతున్నా ఆమె బాధ్యతలు స్వీకరించలేదు. అంతేకాకుండా తనను వేరే విభాగానికి మార్చాలని అధికారులపై ఒత్తిడి తేవడంతో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే రవీంద్రను బుధవారం ఆ స్థానంలో నియమించి ఆమెను ఇంజినీరింగ్ సెక్షన్‌కు బదిలీ చేశారు. ఇది ఇలా ఉంటే ఇంజినీరింగ్ సెక్షన్‌లో కూడా తాను పనిచేయలేనని, మరో విభాగానికి బదిలీ చేయాలని ఆమె అధికారులపై రాజకీయ ఒత్తిడి తీసుకోరావడం వివాదస్పదంగా మారింది. దీంతో అధికారులు ఆమెను సీ–5 సీటులో కొనసాగించాలా లేక ఇంజినీరింగ్ విభాగానికి పంపాలా అనే మీమాంసలో ఉన్నారు. మొత్తం మీద సీ–5 సీటు మున్సిపల్ కార్యాలయంలో హాట్ టాపిక్‌గా మారిందని చెప్పవచ్చు.

రాష్ట్రంలో తీసే సినిమాలకు సబ్సిడీని పెంచాలి

మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా విజ్ఞప్తి



సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌తో దిలీప్ రాజా

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో అరవై శాతం చిత్రీకరణ చేసిన తెలుగు సినిమాలకు సబ్సిడీని పెంపుదల చేయాలని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (మా–ఏపీ)వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి ఈప్రకారం విజ్ఞప్తి చేసినట్టు సాయంత్రం తెనాలిలో విలేకరులకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సినిమా నిర్మాణాలు చేస్తే ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందజేస్తారో కూడా తెలియజేయాల్సిందిగా మంత్రిని కోరినట్లు దిలీప్ రాజా చెప్పారు. 'ఎన్టీఆర్ ఫిలిం నగర్' పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్ కార్డు ఉన్న నటీనటులు, సాంకేతిక నిపుణులకు రాజధానిలో స్థలాలను కేటాయించాలని సూచించినట్టు తెలిపారు. సినిమా నిర్మాణానికి కావలసిన మౌలిక సదుపాయలకోసం ఎన్టీఆర్ ఫిల్మ్ నగర్‌లోనే రైల్వే స్టేషన్ సెట్, ఎయిర్ పోర్ట్, రోడ్ సెట్, మండువా లోగిలి ఇల్లు, పోలీస్ స్టేషన్, హాస్పటల్, తదితర ఫ్లోర్లతో స్టూడియోలను ప్రభుత్వం నిర్మించి నిర్మాతలకు అద్దెలకు ఇస్తే ప్రభుత్వానికి రెవెన్యూ వస్తుందని కూడా సూచించినట్టు తెలిపారు. సినిమా రంగానికి సంబంధించి ప్రభుత్వ పాలసీ అమలుకు హైదరాబాద్ సినిమా ప్రముఖులతో పాటు 'మా–ఏపీ'ని ఆహ్వానిస్తామని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చినట్లుగా దిలీప్‌రాజా వివరించారు. వీరితో నటుడు మిలటరీ ప్రసాద్ ఉన్నారు.

రేపు విఖనస ఆచార్య స్వామి 66వ వర్ష వర్ధనోత్సవం

తెనాలి: శ్రీవైఖానస సేవాసంఘం, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 9న పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత గోవర్ధనస్వామి దేవస్థానంలో విఖనస ఆచార్య స్వామి 66వ వర్ష వర్ధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం ఏడు గంటలకు స్వామివారి సుప్రభాత సేవ తదుపరి ప్రత్యేక పూజలు, 9.30 గంటలకు స్వామివారి గ్రామోత్సవం ఉంటాయి. తర్వాత 11 గంటలకు జరిగే సభకు సంఘ అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహిస్తారు. శ్రీనివాస మంగాపురంలోని టీడీపీ సర్కార్ ప్రధాన అర్చకుడు దీవి బాలాజీ రంగాచార్యులుకు ఆగమ పండిత సత్కారంతోపాటు 'వైఖానస ఆగమధురీణ' బిరుదు ప్రదానం చేసి సత్కరిస్తారు. కొలకలూరులోని శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానం వంశపారంపర్య అర్చకుడు దీవి రామాచార్యులును అర్చక పురస్కారంతో సత్కరిస్తారు. ఇదే వేదికపై తిరుమల ధర్మగిరి వేద పాఠశాల వైఖానస ఆగమ స్మార్త విద్యార్థి దీవి వంశీకృష్ణను ఆగమ విద్యార్థి పురస్కారంతో సత్కరిస్తామని వివరించారు. ఆయా వివరాలను సంఘ అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శి మాధవకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.రఘులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.


రసాయన ఎరువులతో భూమి నిస్సారం



రైతులకు నమూనాల ద్వారా అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

తెనాలిటౌన్: వ్యవసాయ రంగంలో పీఆర్ఏ టెక్నిక్స్, ప్రభుత్వం తెచ్చిన సరికొత్త విధానాలపై రైతులకు కేఎల్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు అవగాహన కల్పించారు. గురువారం రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో విద్యార్థులు పర్యటించి ఏబీఎం చర్చి వద్ద గ్రామపటం, వ్యవసాయ విస్తీర్ణం, సాగు చేస్తున్న వివిధ రకాల పంటలపై నమూనాల ద్వారా రైతులకు అవగాహన నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం వలన భూమి నిస్సారమవుతుందని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగం వలన భూమికి శ్రేయస్సని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనాథ్, బాలాజీ, గిరిధర్, శ్యామ్, వెంకటసాయి, ప్రవీణ్, వీఏఏ నాగరాజు, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి జి.రేణుక కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జెడ్పీ హైస్కూలు విద్యార్థుల ప్రతిభ



ఉపాధ్యాయులతో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

తెనాలిరూరల్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గురువారం జరిగిన అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని అంగలకుదురు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 800 మీటర్ల పరుగుపందెంలో పాఠశాలకు చెందిన ఆంజనేయులు, ప్రశాంతిలు ద్వితీయ స్థానంలో నిలిచారు. అలానే 400 మీటర్ల పరుగుపందెంలో పి.వైష్ణవి ద్వితీయ స్థానంలో నిలిచింది. త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. అలానే గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన కె.హన్విత, డి.సమంత, యు.విజయశ్రీ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీఈటీలు వేమూరి శరత్‌బాబు, పులివర్తి రవిరాజులను పాఠశాల హెచ్‌ఎం ఎన్.అనురాధ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.యామిని

తెనాలిటౌన్: పిల్లల వ్యాధి నిరోధక శక్తికి తల్లిపాలు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.యామిని పేర్కొన్నారు. గురువారం రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.యామిని పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని చెప్పారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారాన్ని ఇవ్వాలని తెలిపారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి రోగాలు రావాన్ని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.నరసమ్మ, శ్రీవాణి, ఆరోగ్య సిబ్బంది అనురాధ, పద్మ, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున ఎన్టీఆర్ కరకట్ట మీద అతివేగంగా వస్తున్న ఓ కారు భరతమాత సెంటర్ వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టును ఢీకొట్టింది. ఓ ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులు కారులో ఉన్నట్లు గుర్తించారు. కారు చెట్టుకు గుద్దిన వెంటనే ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో విద్యార్థులకు గాయాలు కాలేదు. మద్యం మత్తులో ఉన్న యువకులు కారును అక్కడే వదిలేసి మరో వాహనంలో వెళ్లిపోయారు. వారు వెళ్లిన రెండు గంటల్లోపు టోయింగ్ వాహనం తీసుకు వచ్చి గప్‌చుప్‌గా వాహనాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. చెట్టు పక్కనే హై ఓల్టేజ్ స్తంభం ఉంది. కారు ఆ కరెంటు స్తంభాన్ని ఢీకొట్టినట్లయితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి

మంగళగిరి టౌన్: భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ)రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్‌కు నిధులు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేటి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బోర్డును ప్రారంభిస్తామని, అంతేకాకుండా తన వాటాగా రూ.కోటి బోర్డుకు జమ చేస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు అయినప్పటికీ బోర్డును పునరుద్ధరించకపోవడం బాధాకరమన్నారు.

గాయపడిన మహిళకు ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధి చిర్రావూరు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళకు టీడీపీ నాయకులు గురువారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. చిర్రావూరుకు చెందిన పోకల శబరి అనే మహిళ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. హాస్పిటల్ నుంచి వచ్చిన అనంతరం ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న తాడేపల్లి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కిరణ్ రూ.30 వేలు, అదే గ్రామానికి చెందిన యేసు ప్రసాద్ రూ.10 వేలు అందజేశారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై రూ.23 వేల కోట్ల భారం

కాజ/చినకాకాని(మంగళగిరి): స్మార్ట్ మీటర్లతో రాష్ట్ర ప్రజలపై రూ.23 వేల కోట్ల భారం ప్రభుత్వం మోపుతుందని ప్రజా ఐక్య వేదిక నాయకులు అన్నారు. కాజ సచివాలయం వద్ద స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. చినకాకానిలో స్మార్ట్ మీటర్ల వద్దంటూ నాయకులు ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మేము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఏడాదిన్నర కాలంలోనే మూడు సార్లు పెంచారన్నారు. మంత్రి నారా లోకేష్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని పిలుపునిచ్చి, అధికారంలోకి వచ్చాక అదానీ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ముందుకు రావడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు ఎవరి లాభం కొరకు బిగిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా ఐక్యవేదిక నాయకులు ఈమని అప్పారావు, వుద్దంటి దుర్గారావు, భీమిరెడ్డి కోటేశ్వరి, మారెళ్ళ అంజిరెడ్డి, గండికోట బాబూవరప్రసాద్, శ్రీనివాసరావు, సింహాద్రి సుమ, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.